
జేపీ రాముడుకు పురస్కారాన్ని అందజేస్తున్న రామమోహనరావు

సృజనాత్మక ఆలోచనాపరుడు పీఎల్ సంజీవరెడ్డి

చిక్కడపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సృజనాత్మక ఆలోచనాపరుడు పీఎల్ సంజీవరెడ్డి అని తమిళనాడు పూర్వ గవర్నర్ పీఎస్ రామమోహనరావు అన్నారు. రసమయి సంస్థ ఆధ్వర్యంలో గురువారం రాత్రి త్యాగరాయగానసభలో డా. పీఎల్ సంజీవరెడ్డి స్మారక పురస్కార ప్రదానోత్సవం జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన సమైక్యాంధ్ర తొలి డీజీపీ జాస్తి వెంకట రాముడుకు పురస్కారాన్ని అందజేసి మాట్లాడారు. పీఎల్ సంజీవరెడ్డి సూచనతోనే బసవరామ తారకం క్యాన్సర్ ఆస్పత్రి ఏర్పాటు జరిగిందని తెలిపారు. పురస్కారగ్రహీత రాముడు మాట్లాడుతూ.. చిన్న సహాయం అవసరమైన వారికి చేయగలిగితే ప్రజల హృదయాల్లో స్థానం ఉంటుందని, అవే రివార్డులు, అవార్డులు అన్నారు. అధ్యక్షత వహించిన ప్రముఖ సాహితీవేత్త ఆచార్య కొలకలూరి ఇనాక్ మాట్లాడుతూ.. సంజీవరెడ్డి సాహిత్య, సామాజిక సేవా భావం కలవారని అన్నారు. విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్, నరసింహప్ప, డా.రాము, పైడి సందీప్‌కృష్ణ, ఆశాలత పాల్గొన్నారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రొఫెసర్ జి.హరగోపాల్ తదితరులు

లౌకిక ప్రజాస్వామ్య విలువలకు పాలకుల గండి

● ప్రొఫెసర్ జి.హరగోపాల్

రాంనగర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): లౌకిక ప్రజాస్వామ్య విలువలకు పాలకులు గండి కొడుతున్నారని ప్రొఫెసర్ జి.హరగోపాల్ అన్నారు. గురువారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో సెక్యులర్ రైటర్స్ ఫోరం ఆధ్వర్యంలో ఈ నెల 14న మహబూబ్‌నగర్‌లో జరుగుతున్న సమావేశం సందర్భంగా రూపొందించిన ఫోరం తొలి రాష్ట్ర మహాసభ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారత రాజ్యాంగాన్ని యూనివర్సిటీ స్థాయిలో సిలబస్‌లో పొందుపరచాలని, ఇందుకోసం మహాసభ తీర్మానం చేయబోతుందన్నారు. రాజకీయవాదులు ప్రజలను మతపరంగా విభజించి సమాజంలో విద్వేషాలను రెచ్చగొడుతున్నారని ఆరోపించారు. ప్రముఖ రచయిత పసునూరి రవీందర్ మాట్లాడుతూ.. ద్వేషం, అసహనం ఎంత ప్రమాదమో సమాజానికి తెలియజేయాల్సిన అవసరం రచయితలపై ఉందన్నారు. కార్యక్రమంలో కవి భూపతి వెంకటేశ్వర్లు, ప్రొఫెసర్ కాత్యాయని విద్మహే, నరేష్ సూఫీ, స్కైబాబు, ప్రొఫెసర్ మెట్టు రవీందర్, గుడిపల్లి నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ

కాంగ్రెస్‌కు పాలించే అర్హత లేదు

బర్కత్‌పుర, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): మాయ మాటలతో ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి రాష్ట్రాన్ని పాలించే అర్హత లేదని బీజేపీ మాజీ ఎమ్మెల్యే యెండల లక్ష్మీనారాయణ ఆరోపించారు. గురువారం రాత్రి కాచిగూడ డివిజన్ చప్పల్‌బజార్‌లో కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై నిర్వహించిన బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్‌కు పట్టిన గతే కాంగ్రెస్ ప్రభుత్వానికి పడుతుందన్నారు. బీజేపీ సెంట్రల్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ ఎన్.గౌతమ్‌రావు మాట్లాడుతూ.. హామీలను అమలు చేయని కాంగ్రెస్ విజయోత్సవాలు జరుపుకోవడం సిగ్గుచేటన్నారు. మాజీమంత్రి సి.కృష్ణాయాదవ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధ్యక్షుడు జి.ఆనంద్‌గౌడ్, కార్పొరేటర్లు కన్నె ఉమాదేవి, వై.అమృత, నాయకులు కన్నె రమేష్‌యాదవ్, ఎ.సూర్యప్రకాష్‌సింగ్ తదితరులు పాల్గొన్నారు.



నాగేశ్వరరావుకు ఘంటసాల పురస్కారాన్ని ప్రదానం చేస్తున్న అతిథులు

ఘంటసాల పాటల అనుకరణలో మేటి.. నాగేశ్వరరావు

చిక్కడపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఘంటసాల పాటల అనుకరణలో మేటి పేరి నాగేశ్వరరావు అని ప్రముఖ గాయకుడు చింతలపూడి త్రినాథరావు అన్నారు. భారతి ఆర్ట్స్ అకాడమీ, ఏబీసీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పేరి నాగేశ్వరరావుకు ఘంటసాల వెంకటేశ్వరరావు జీవన సాఫల్య పురస్కార ప్రదానోత్సవం సభ గురువారం రాత్రి త్యాగరాయగానసభలో జరిగింది. సంస్థల పక్షాన వరల్డ్ రికార్డ్ సమన్వయ కర్త కేవీ రమణారావు పాల్గొని త్రినాథరావుతో కలిసి ఆయనకు పురస్కారాన్ని అందజేశారు. రమణారావు మాట్లాడుతూ.. నాగేశ్వరరావు గళం విభిన్నమన్నారు. ఘంటసాల స్వరానికి సామీప్యంగా ఉంటుందన్నారు. సిండికేట్ బ్యాంక్ విశ్రాంత్ ఏజీఎం పేరి కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ప్రసన్న, నాగేశ్వరరావు ఘంటసాల యుగళ గీతాలు మధురంగా ఆలపించారు.


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఆర్. కృష్ణయ్య, రామకృష్ణ తదితరులు

10న కలెక్టర్, ఆర్డీవో కార్యాలయాల ముట్టడి

బర్కత్‌పుర, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): నాలుగు వేల కోట్ల రూపాయల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఈనెల 10న రాష్ట్రవ్యాప్తంగా కలెక్టర్, ఆర్డీవో, తహసీల్దార్ కార్యాలయాల ముట్టడి నిర్వహిస్తున్నట్లు మాజీ ఎంపీ ఆర్.కృష్ణయ్య తెలిపారు. బకాయిల విడుదలలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తే ఫీజుల పోరును ప్రజా ఉద్యమంగా మారుస్తామన్నారు. గురువారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల రామకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో ముట్టడి పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని ఎత్తివేసే కుట్ర జరుగుతోందన్నారు. కార్యక్రమంలో బీసీ సంఘం నేతలు నీల వెంకటేష్, జి.మల్లేష్‌యాదవ్, సి.రాజేందర్, జిల్లపల్లి అంజి, నందగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

8న ఉచిత వైద్య శిబిరం

నల్లకుంట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బాగ్‌అంబర్‌పేట డివిజన్ మల్లికార్జున్‌నగర్‌లోని సాయిదత్త ఆస్పత్రి ఆధ్వర్యంలో ఈ నెల 8వ తేదీన ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు ఆస్పత్రి అడ్మినిస్ట్రేషన్ ఇన్‌చార్జి డాక్టర్ కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

రోడ్డుపైనే చెత్త సేకరణ వాహనాల పార్కింగ్

● ట్రాఫిక్‌కు అంతరాయం
● ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీసులు

ముషీరాబాద్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బాపూజీనగర్ వెళ్లే మార్గంలో గల నల్లపోచమ్మ దేవాలయ సమీపంలో రోడ్డుపై ఇరుపక్కల చెత్త సేకరించే వాహనాలను పార్క్ చేయడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడడంతో పాటు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్ పోలీసులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్ జామ్‌తో స్కూల్‌కు వెళ్లే విద్యార్థులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. చెత్త సేకరించే వాహనాలను రోడ్డుపై పార్క్ చేయడంతో ఇబ్బందులు పడుతున్నామని బాపూజీనగర్, అరుణ కో-ఆపరేటివ్ సొసైటీ ప్రాంత ప్రజలు ఆరోపిస్తున్నారు. వాహనాలను పార్క్ చేసిన ప్రాంతంలో చెత్తను వేయడంతో దుర్వాసన వస్తోందంటున్నారు.


రోడ్డుపై పార్క్ చేసిన చెత్త సేకరించే వాహనాలు

జోనల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తా



రోడ్డుపై వాహనాలను పార్క్ చేసిన విషయమై జోనల్ కమిషనర్‌కు ఫిర్యాదు చేస్తా. రోడ్డు పక్కన చెత్త సేకరించే వాహనాలను పార్క్ చేయకుండా అధికారులు చర్యలు తీసుకోవాలి.
- సుప్రియా నవీన్‌గౌడ్, కార్పొరేటర్

ఇబ్బందులు పడుతున్నాం



చెత్తను సేకరించే వాహనాలను రోడ్డుపై పార్క్ చేయడంతో ఇబ్బందులు పడుతున్నాం. అధికారులు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు.
- నందు, స్థానికుడు

నెరవేరిన ఎల్‌బీనగర్ వాసుల సొంతింటి కల

37 మంది లబ్ధిదారులకు 'డబుల్' ఇళ్ల పట్టాలు పంపిణీ చేసిన మంత్రులు పొన్నం, పొంగులేటి

కవాడిగూడ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): లాల్‌బహదూర్ శాస్త్రినగర్(ఎల్‌బీనగర్)లో లబ్ధిదారుల సొంతింటి కల నెరవేరింది. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కవాడిగూడ డివిజన్ ఎల్‌బీనగర్‌లో జి ప్లస్ ఫోర్ అంతస్తులలో 40 ఇళ్లు నిర్మించారు.

గురువారం కలెక్టరేట్‌లో 37 మంది లబ్ధిదారులకు మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే ముఠా గోపాల్, మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ మోతె శ్రీలతాశోభన్‌రెడ్డి, కవాడిగూడ కార్పొరేటర్ రచనశ్రీ, అనుదీప్ దురిశెట్టి ఆధ్వర్యంలో పట్టాలు, అలాట్‌మెంట్ లెటర్లు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అర్హులైన పేదలకు అమలు చేస్తామని హామీ ఇచ్చారు. లబ్ధిదారులకు ఖాళీ స్థలం ఉంటే దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కార్యక్రమంలో తహసీల్దార్ రాణా ప్రతాప్‌సింగ్, బీఆర్‌ఎస్ నాయకులు ముఠా జైసింహ, వల్లాల శ్యామ్‌యాదవ్, ముచ్చకుర్తి ప్రభాకర్, బీజేపీ రాష్ట్ర నాయకుడు జి. వెంకటేష్, డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎంసీ మహేందర్‌బాబు, ఎ. ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



బస్తీవాసులకు ఇళ్ల పట్టాలు అందజేస్తున్న మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యే ముఠా గోపాల్, కలెక్టర్, మేయర్


మురుగు సమస్యను అధికారులకు వివరిస్తున్న కార్పొరేటర్

మల్లికార్జుననగర్‌లో మురుగు సమస్యను పరిష్కరించాలి

నల్లకుంట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఉస్మానియా యూనివర్సిటీ మోహిన్ చెరువు నుంచి వస్తున్న మురుగునీటితో బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని మల్లికార్జుననగర్ వాసులు ఇబ్బందులు పడుతున్నారని కార్పొరేటర్ బి. పద్మా వెంకటరెడ్డి అన్నారు. సమస్య పరిష్కారానికి ఓయూ అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. గురువారం ఉస్మానియా యూనివర్సిటీ అధికారులతో కలిసి ఆ ప్రాంతంలో పర్యటించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బి.వెంకటరెడ్డి, బస్తీ వాసులు, బీఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు.

బెనిఫిట్ షోలను రద్దు చేయాలి

● అల్లు అర్జున్, థియేటర్ యాజమాన్యంపై కేసు నమోదు చేయాలంటూ విద్యార్థి సంఘాల ఆందోళన
● నేతల అరెస్టు.. ఆర్టీసీ క్రాస్‌రోడ్డులో ఉద్రిక్తత

కవాడిగూడ/ రాంనగర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో భారీ సినిమాల బెనిఫిట్ షోలను రద్దు చేయాలని విద్యార్థి సంఘాల నేతలు డిమాండ్ చేశారు. పుష్ప-2 సినిమా బెనిఫిట్ షోకు హీరో అల్లు అర్జున్ రావడంతోనే తొక్కిసలాట జరిగి మహిళ మృతి చెందిందని ఆరోపించారు. బాధితురాలి కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం సంధ్య 70 ఎంఎం థియేటర్ ఎదుట డీవైఎఫ్‌ఐ, ఎస్ఎఫ్‌ఐ, పీడీఎస్‌యూ విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు.

విద్యార్థి సంఘాల నేతలు థియేటర్ యాజమాన్యానికి, అల్లు అర్జున్, నిర్మాతలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ధర్నా నిర్వహించారు. విద్యార్థి సంఘాల నేతలను పోలీసులు అరెస్ట్ చేయడంతో ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లో కొద్దిసేపు ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. అరెస్ట్ చేసిన వారిని అబిడ్స్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. మృతి చెందిన రేవతి కుటుంబానికి కోటి రూపాయల నష్టపరిహారం చెల్లించడంతోపాటు, ఆమె కుమారుడికి మెరుగైన వైద్యం అందించాలని ఎస్ఎఫ్‌ఐ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు ఆర్ఎల్ మూర్తి, టి నాగరాజు, డీవైఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేష్ డిమాండ్ చేశారు. సినిమా చూద్దామని వస్తే వినోదానికి బదులు విషాదాలు నెలకొంటున్నాయన్నారు. బెనిఫిట్ షోలకు అనుమతి ఇవ్వకుండా చట్టం తీసుకురావాలన్నారు. ఘటనకు కారణమైన అల్లు అర్జున్, సంధ్య థియేటర్ యాజమాన్యంపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

నిరసన కార్యక్రమంలో ఎస్ఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు రజనీకాంత్, రాష్ట్ర సహాయ కార్యదర్శి అశోక్‌రెడ్డి, డీవైఎఫ్‌ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు జావెద్, నగర అధ్యక్షుడు హష్మీబాయి, ఎస్ఎఫ్‌ఐ రాష్ట్ర కమిటీ సభ్యులు లెనిన్, గువేరా, రమేష్, రమ్య, విఘ్నేష్, నాగేందర్, సహన తదితరులు పాల్గొన్నారు.


పోలీసులకు ఫిర్యాదు చేస్తున్న ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ దిడ్డి సుధాకర్, యమున

పోలీసులకు 'ఆప్' ఫిర్యాదు

రేవతి మృతికి కారణమైన వారిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్, యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు విజయ్‌మల్లంగి, మహిళా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అడ్వొకేట్ యమునాగౌడ్ చిక్కడపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు.



సంధ్య థియేటర్ ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థి సంఘాల నేతలు

ఎక్స్‌గ్రేషియా చెల్లించాలి

మృతురాలు రేవతి కుటుంబానికి రూ. 25 లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, ఆమె కుమారుడికి మెరుగైన వైద్యం అందించాలని యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఎం. అరవింద్‌కుమార్ యాదవ్ డిమాండ్ చేశారు. వినోదం కోసం వచ్చిన మహిళ తొక్కిసలాటలో చనిపోవడం బాధాకరమన్నారు. హీరో అల్లు అర్జున్, మైత్రి మూవీస్, దర్శకులు, థియేటర్ యాజమాన్యం మృతురాలి కుటుంబాన్ని ఆదుకోవాలన్నారు.

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

రాంనగర్, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ ఉద్యోగుల దీర్ఘకాలిక పెండింగ్ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆర్టీసీ జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న డిమాండ్ చేశారు. గురువారం ఆర్టీసీ జేఏసీ ఆధ్వర్యంలో బస్ భవన్ కార్యక్రమం నిర్వహించారు.

ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేస్తామని హామీ ఇచ్చి ఏడాది అయినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం విలీనం గురించి గెజిట్ విడుదల చేసినా కాంగ్రెస్ ప్రభుత్వం అపాయింటెడ్ డేట్ ప్రకటించలేదని ఆరోపించారు. ట్రేడ్ యూనియన్‌లను పునరుద్ధరిస్తే ప్రభుత్వం, యాజమాన్యానికి ఆర్థిక భారం ఉండదన్నారు. 2018లో సమ్మె కాలంలో ఉద్యోగులపై నమోదు చేసిన పోలీసు కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. పీఎఫ్, సీసీఎస్ బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు.

ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు ఎస్.బాబు మాట్లాడుతూ.. మోటారు వెహికల్ ట్యాక్స్‌ల భారాన్ని కర్ణాటకలో ప్రభుత్వం భరిస్తుందని, రాష్ట్రంలో కూడా ఆ విధానం అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఆర్టీసీ జేఏసీ నేత కమలాకర్ గౌడ్, ఏఐటీయూసీ తెలంగాణ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్.బాల్‌రాజ్, కన్వీనర్ ఎండీ మౌలానా, కో-కన్వీనర్లు కత్తుల యాదయ్య, సుద్దాల సురేష్, బి.యాదగిరి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఆర్టీసీ జేఏసీ చైర్మన్ ఈదురు వెంకన్న


నిరసన వ్యక్తం చేస్తున్న ప్రజా సంఘాల నేతలు

మహిళలపై దాడులను అరికట్టాలంటూ నిరసన

కవాడిగూడ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ప్రపంచ వ్యాప్తంగా మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టేందుకు ఐక్యంగా ఉద్యమించాలని వివిధ సంఘాల నేతలు పిలుపునిచ్చారు. మహిళలపై జరుగుతున్న దాడులు, అత్యాచారాలు, హత్యలను అరికట్టేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ చైతన్య మహిళా సంఘం ఆధ్వర్యంలో గురువారం లోయర్ ట్యాంక్‌బండ్‌లో అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. చైతన్య మహిళా సంఘం నేతలు అరుణ, శ్రీదేవి, సత్య, జయ, గిరిజ తదితరులు పాల్గొన్నారు.

1,360 కిలోల రేషన్ బియ్యం స్వాధీనం

● ఇద్దరు నిందితుల అరెస్టు, ఆటోట్రాలీ సీజ్

కవాడిగూడ, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న ఇద్దరు నిందితులను గాంధీనగర్ పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి 1,360 కిలోల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. రేషన్ బియ్యాన్ని బన్సీలాల్‌పేట్ కమాన్ వద్ద నుంచి ఆటో ట్రాలీలో తరలిస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. ఆ ప్రాంతంలో నిఘాపెట్టి ముషీరాబాద్‌కు చెందిన మహ్మద్ సలావుద్దీన్(29), భోలక్‌పూర్ ధర్మకాంట వద్ద నివసిస్తున్న మహ్మద్ చాంద్‌ను పట్టుకున్నారు. బియ్యాన్ని స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండ్‌కు తరలించారు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న రేషన్ బియ్యం, నిందితులు (కూర్చున్నవారు)


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సంజీవరెడ్డి తదితరులు

ఐఎన్‌టీయూసీని గెలిపిస్తే

జలమండలి ఉద్యోగుల సమస్యలకు పరిష్కారం

బర్కత్‌పుర, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): జలమండలి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల్లో ఐఎన్‌టీయూసీ అభ్యర్థులను గెలిపిస్తేనే ఉద్యోగులు, కార్మికుల సమస్యలు పరిష్కారమవుతాయని ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎంపీ జీ.సంజీవరెడ్డి అన్నారు. బర్కత్‌పురలోగల ఐఎన్‌టీయూసీ కార్యాలయంలో యూనియన్ పోస్టర్‌ను గురువారం ఆవిష్కరించి మాట్లాడారు. జలమండలి గుర్తింపు ఎన్నికల్లో కార్మికుల హక్కులు, ప్రయోజనాల కోసం నిరంతరం పోరాడే ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.రాజిరెడ్డిని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి ఆర్.డి.చంద్రశేఖర్, సీ.హెచ్. సురేష్‌బాబు, భూమయ్య, కె.రామరాజు తదితరులు పాల్గొన్నారు.


సంయుక్త కార్మిక కమిషనర్‌కు నామినేషన్ పత్రాలు అందజేస్తున్న రాంబాబు

రాంబుయాదవ్ నామినేషన్

చిక్కడపల్లి, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): బీఆర్‌టీయూకు అనుబంధంగా ఉన్న తెలంగాణ వాటర్‌వర్క్స్ ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్షుడు జి. రాంబాబుయాదవ్ గురువారం కార్మిక కమిషనరేట్‌లో నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్ పత్రాలను జంటనగరాల సంయుక్త కార్మిక కమిషనర్ సునీతా గోపాల్‌దాస్‌కు అందజేశారు. యూనియన్ ముఖ్యనాయకులు జి. లక్ష్మీనారాయణ, మేడ్చల్ శ్రీనివాస్, కోకాపేట్ జంగయ్య, జమీల్ అహ్మద్, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సేవలో సంతృప్తి

గోల్నాక, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): స్వచ్ఛంద సేవలో సంతృప్తి ఉంటుందని ఈస్ట్‌జోన్ అడిషనల్ డీసీపీ జోగులనర్సయ్య, మల్కాజిగిరి అడిషనల్ డీసీపీ వెంకటరమణ అన్నారు. అంతర్జాతీయ స్వచ్ఛంద సేవకుల దినోత్సవాన్ని పురస్కరించుకుని సేవాయూత్ అసోసియేషన్ అధ్యక్షుడు రచ్చ శ్రీనివాస్ ఆధ్వర్యంలో గోల్నాకలో పారిశుధ్య కార్మికులను గురువారం సత్కరించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న వారు మాట్లాడుతూ.. పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివన్నారు. జీహెచ్‌ఎంసీ అంబర్‌పేట సర్కిల్ ఏఎంహెచ్‌వో డాక్టర్ హేమలత మాట్లాడుతూ.. సేవకుల దినోత్సవం నాడు పారిశుధ్య కార్మికులను సత్కరించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో హైకోర్టు న్యాయవాది జీఎల్. నరసింహారావు, అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సేవకులు, సంస్థల కృషిని అభినందించాలి

చిక్కడపల్లి: పినాకిని యూత్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో గురువారం త్యాగరాయగానసభలో స్వచ్ఛంద సేవకుల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్తమ సేవా అవార్డులను సురేష్, ఆలియా బాను, మిరియాల లక్ష్మి, నరసింహులుగౌడ్, రేష్మకౌర్, విజయకుమార్ తదితరులకు కేంద్ర మాజీ మంత్రి సముద్రాల వేణుగోపాలచారి అందజేశారు. స్వచ్ఛంద సేవకులు, సంస్థల కృషిని అభినందించాలన్నారు. కార్యక్రమంలో నిర్వాహకులు మురళీమోహన్‌రాజు, రిటైర్డ్ జడ్జి బూర్గుల మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.


పారిశుధ్య కార్మికులను సన్మానించిన అడిషనల్ డీసీపీలు

'తెలంగాణ అస్తిత్వంపై సీఎం దాడి'

పంజాగుట్ట, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): సీఎం రేవంత్ రెడ్డి తెలంగాణ అస్తిత్వంపై దాడి చేస్తున్నారని రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్ పటేల్ ఆరోపించారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ సభ్యుడు సీహెచ్.ఉపేంద్ర, ఎస్సీ కమిషన్ మాజీ సభ్యులు చిలకమర్తి నరసింహ, విద్యాసాగర్‌తో కలిసి మాట్లాడారు. సమైక్యవాదుల కనుసన్నల్లో ప్రజాపాలన చేస్తున్న సీఎం తెలంగాణ అస్తిత్వంపై జరిపే దాడిని ఖండిస్తున్నామన్నారు. తెలంగాణ తల్లి రూపాన్ని మార్చే ప్రతిపాదనను వెంటనే విరమించుకోవాలన్నారు. కేబినెట్ మంత్రులకు కూడా తెలియకుండా రహస్యంగా విగ్రహం తయారు చేయిస్తున్నారని, విగ్రహ రూపాన్ని మారుస్తుంటే ప్రొఫెసర్ కోదండరామ్ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు.

రైలు నుంచి జారిపడి సెక్యూరిటీ గార్డు మృతి

బర్కత్‌పుర, డిసెంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎంఎంటీఎస్ రైలు నుంచి జారిపడి సెక్యూరిటీ గార్డు మృతి చెందాడు. కాచిగూడలో నివసిస్తున్న గుమ్మడి సాయిబాబా (64) ప్రైవేట్ సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. బుధవారం రాత్రి ఉప్పుగూడ రైల్వే స్టేషన్‌లో నడుస్తున్న ఎంఎంటీఎస్ రైలు దిగబోయి పడిపోయాడు. తీవ్రంగా గాయపడడంతో ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ గురువారం ఉదయం మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రైల్వే ప్లాట్‌ఫాంపై గుర్తుతెలియని వ్యక్తి..

విద్యానగర్ రైల్వే స్టేషన్‌లో రెండవ నంబర్ ప్లాట్‌ఫారం వద్ద 38 ఏళ్ల వయసు గల గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.